
సాక్షి కృష్ణాజిల్లా

శనివారం । 4 । మే । 2024



బంగారు తాపడం పనులకు విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కట్ట శ్రీనివాస్‌రెడ్డి కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 504.90అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



	కనిష్టం	గరిష్టం
నందిగామ	30	43.1
జగ్గయ్యపేట	32.3	44
మచిలీపట్నం	30	36
గుడివాడ	30	39

న్యూస్‌రీల్

టీడీపీని జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఓడించాలి

గుడివాడ ఎమ్మెల్యే అభ్యర్థి కొడాలి నాని



గుడ్లవల్లేరు: జూనియర్ ఎన్టీఆర్‌ను అణగదొక్కాలని టీడీపీ కుటిలయత్నం చేస్తోందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆరోపించారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం వేమవరంలో శుక్రవారం జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొడాలి నాని మాట్లాడుతూ టీడీపీని ఈ ఎన్నికల్లో ఎన్టీఆర్ ఫ్యాన్స్ చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. పెద్ద ఎన్టీఆర్, జూనియర్ ఎన్టీఆర్, హరికృష్ణపై సీఎం జగన్‌తో పాటు తనకు అమితమైన ప్రేమ ఉండటంతో ఎన్టీఆర్ జిల్లా అని పేరు పెట్టినట్లు చెప్పారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు నమ్మకద్రోహం చేసి పార్టీ లాక్కున్న నీచుడు చంద్రబాబు అని గుర్తుచేశారు. జూనియర్ ఎన్టీఆర్ జెండాలతో అభిమానులు పదిమంది ఆ పార్టీ కార్యక్రమాలకు వెళితే తన్నితరిమేసిన పరిస్థితి అనేకచోట్ల ఏర్పడిందని గుర్తుచేశారు. జూనియర్ ఎన్టీఆర్ టీడీపీ పగ్గాలు చేపట్టినప్పుడే అభిమానులు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రజలను నమ్ముకుని ముందుకెళుతున్న సీఎం జగన్‌కు, తనకు.. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు మద్దతుగా నిలవాలని కోరారు. సమావేశంలో ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు యార్లగడ్డ మురళి, బండికోటి బాబు, కేశన మహేష్, ఫణి, నాని, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

96.14 శాతం పింఛన్ల పంపిణీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని లబ్ధిదారులకు 96.14 శాతం పింఛన్లను శుక్రవారానికి అందజేశారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసిన వారు కాకుండా ఖాతాలు లేని వారు జిల్లాలో 65,344 మంది ఉన్నారు. వీరిలో 62,770 మందికి ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది పింఛన్లను అందజేసినట్లు అధికారులు తెలిపారు.

రెండో రోజు హోం ఓటింగ్ ప్రశాంతం

చిలకలపూడి(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, 40 శాతం పైబడి దివ్యాంగులకు హోం ఓటింగ్ ప్రక్రియ శుక్రవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 1,762 మంది వృద్ధులు, వికలాంగులు దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం నిర్వహించిన హోం ఓటింగ్‌లో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 606 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇప్పటి వరకు 1005 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు నోడల్ అధికారి షేక్ షాహెద్‌బాబు తెలిపారు.

దుర్గమ్మ సేవలో ఉన్నతాధికారులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, కార్యదర్శి కేవీవీ సత్యనారాయణలు శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా, ఉన్నతాధికారులకు ఆలయ అర్చకులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

జరిమానాలతో రైల్వేకు రూ.7.96 కోట్ల ఆదాయం

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): విజయవాడ డివిజన్ పరిధిలో టికెట్ లేకుండా రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికులకు విధించిన జరిమానాల ద్వారా రైల్వేకు రూ.7.96 కోట్ల ఆదాయం వచ్చినట్లు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మండ్రూపకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో ఈ ఏప్రిల్ నెలలో ఇది అత్యధిక ఆదాయమన్నారు. గత మార్చిలో జరిమానాల ద్వారా డివిజన్‌కు రూ.7.36 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. టికెట్ లేకుండా రైళ్లలో ప్రయాణించడం, ముందుగా బుకింగ్ చేసుకోకుండా లగేజీని రైళ్లలో తరలిస్తున్న వారికి విధించిన జరిమానాల ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

పండుటాకులు విలవిల

- బ్యాంకుల వద్ద అవ్వాతాతల పడిగాపులు
- మినిమమ్ బ్యాలెన్స్ మినహాయించి నగదు ఇస్తున్న వైనం
- చంద్రబాబు కుట్రతో ఇబ్బందులు పడుతున్నామంటున్న వృద్ధులు

కోడి కూయక ముందే.. వానొచ్చినా.. వరదొచ్చినా.. ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా ఠంచన్‌గా ప్రతి నెలా ఒకటో తేదీ వలంటీర్ల నుంచి పింఛన్ అందుకునే వారు అవ్వాతాతలు. చంద్రబాబు అండ్ కో చేసిన నిర్వాకంతో ఇప్పుడు గడప దాటాల్సి వస్తోంది. ప్రతి నెలా చిరునవ్వుతో ఇంటి వద్దే పింఛన్ తీసుకునే లబ్ధిదారులు మండుటెండలో రోడ్డున పడుతున్నారు. టీడీపీ మద్దతుదారుల తీరుతో.. వలంటీర్లను విధులకు దూరంగా ఉంచడంతో పండుటాకులు బ్యాంకు వద్ద పింఛన్ తీసుకొనేందుకు శుక్రవారం గంటల కొద్దీ క్యూలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే పింఛన్ తీసుకునేవారమని చంద్రబాబు కుట్రతో ఇబ్బందులు పడుతున్నామని.. బాబుకు మాపై పగ ఎందుకుని, మా ఉసురు తగులుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల లబ్ధిదారుల ఖాతాల్లో పింఛన్ వేయడం.. బ్యాంకుల వద్ద అనేక ఆంక్షలతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో కాలంగా పనిచేయని ఖాతాలో నగదు జమ కావడం, చార్జీలు వసూలు చేయడంతో పాటు, మినిమమ్ బ్యాలెన్స్ కట్ చేసుకుని మిగిలిన నగదు అందజేస్తున్నారు. దీంతో ప్రతి నెలా పింఛన్ సొమ్ముతో లబ్ధిదారులు వేసుకునే ప్రణాళిక ఖర్చులకు అవస్థ పడుతున్నారు. బ్యాంకుల్లో ఉన్న కరస్పాండెంట్ల ద్వారా వేలిముద్రలు సేకరించి పింఛన్ సొమ్ము ఇవ్వడంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులైతే కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్యాంకులకు వచ్చి నగదు తీసుకునేందుకు రోజంతా వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటి వద్దకే డబ్బులు వచ్చేవని వృద్ధులు అంటున్నారు. చంద్రబాబు అక్కసు.. మాకు శిక్షలా మారిందని వారు వాపోతున్నారు.



మోపిదేవి ఎస్‌బీఐ ఎదుట పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు

- అవనిగడ్డ నియోజకవర్గంలోని నాగాయలంక, కోడూరు మండలాల్లోని తీర ప్రాంతాల్లో 20 కిలోమీటర్ల దూరం నుంచి లబ్ధిదారులు ఆటోల ద్వారా మండల కేంద్రాలకు వచ్చి బ్యాంకుల వద్ద క్యూలో నిలబడి నగదు తీసుకోవాల్సి వస్తోంది.
- పెనమలూరు నియోజకవర్గంలో లబ్ధిదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కంకిపాడు, పెనమలూరు గ్రామాల్లో ఉన్న యూనియన్ బ్యాంకు, ఎస్‌బీఐల్లో లబ్ధిదారుల ఖాతాలు ఎన్నో సంవత్సరాలు పని చేయకపోవడంతో అప్‌డేషన్ చేయడానికి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో లబ్ధిదారులు డబ్బులు వస్తాయో, లేదోనని ఆందోళన చెందుతున్నారు.
- గుడివాడ నియోజకవర్గంలో ఉదయం నుంచి బ్యాంకుల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఖాతాల్లో మినిమమ్ బ్యాలెన్స్ మినహాయించుకుని మిగిలిన సొమ్ము ఇవ్వటంతో పింఛనర్లు ఆందోళన చెందుతున్నారు.
- గన్నవరం నియోజకవర్గంలో కొన్ని ఖాతాల్లో అసలు నగదు జమ కావడం లేదు. లబ్ధిదారులు బ్యాంకులో డబ్బులు జమవుతాయా లేదా ఇంటికి వచ్చి ఇస్తారో.. అనుకుంటున్నారు.
- పామర్రు నియోజకవర్గంలో యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐలో పింఛన్ సొమ్ము డ్రా చేసుకునేందుకు లబ్ధిదారులు ఇక్కట్లు పడ్డారు. గంటల తరబడి వేచి ఉండటంతో ఆహారం లేక వృద్ధులు నీరసించి కనిపించారు.
- పెడన నియోజకవర్గంలో బ్యాంకుల వద్ద పడిగాపులు పడుతుండటంతో ఆయా గ్రామాల్లో బ్యాంకు కరస్పాండెంట్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి నగదును అందజేశారు.
- మచిలీపట్నం నియోజకవర్గంలో బ్యాంకుల వద్ద లబ్ధిదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఏటీఎం కార్డులు లేకపోవటం ఒక ఎత్తైతే బ్యాంకుల్లో ఖాతాలు పని చేయడం లేదు. దీంతో సిబ్బందిన నగదును డ్రా చేసుకునేందుకు సోమ, మంగళవారాల్లో రావాలని చెప్పడంతో పింఛనర్లు ఆందోళన చెందుతున్నారు.



అయ్యా ఈ ఎండ భరించలేకపోతున్నా. పింఛన్ తీసుకువెళదామని బ్యాంకుకి పొద్దున వచ్చాను. మధ్యాహ్నమైంది. కళ్లు తిరిగి పడిపోతానేమో అని భయంగా ఉంది. పింఛన్ ఇప్పించండయ్యా.. అంటూ బంటుమిల్లి మండలం ములపర్రుకు చెందిన బోయిన నాగేశ్వరమ్మ బ్యాంకు వద్ద పలువురిని ప్రాథేయపడింది.



బంటుమిల్లి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా(బీసీల) వద్ద శుక్రవారం ఎండలో బారులు తీరిన పింఛనర్లు

బ్యాంకు ఖాతా పనిచేయడం లేదన్నారు



బ్యాంకు ఖాతాను ఎప్పటి నుంచో వాడటం లేదు. ఖాతాలో పింఛన్ సొమ్ము వేశారని వచ్చాను. తీరా చూస్తే నా ఖాతా పనిచేయడం లేదని చెప్పారు. ఖాతాను పునరుద్ధరించడానికి నాలుగు రోజులు ఆగి రమ్మంటున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలువతో ఇంటి వద్దే పింఛను తీసుకుని ఇబ్బంది తెలియకుండా ఉండేవాళ్లం. చంద్రబాబు అండ్ కో చర్యలతో అవస్థ పడుతున్నాం.

– ఏలూరి సావిత్రమ్మ, బలరామునిపేట, మచిలీపట్నం

పెన్షన్ వేసినా చేతికి అందడం లేదు



వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, ఇతర పింఛనర్లు బ్యాంకుల్లో పింఛన్ జమచేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రూ.3 వేలు పింఛన్ తీసుకునే వారికి బ్యాంకు ఖాతాలు వాడాల్సిన అవసరం ఏమి ఉంటుంది. ఎక్కువ మందివి వినియోగంలో లేని ఖాతాలుగా బ్యాంకులు గుర్తించాయి. తిరిగి ఖాతాలను వినియోగంలోని తేవాలంటే ఈకేవైసీ నిబంధనలు పాటించాలని బ్యాంకు అధికారులు అంటున్నారు. దీంతో పెన్షన్ వచ్చినా ఉపయోగంలేదు. అనేకమంది వృద్ధులకు కనీసం విత్‌డ్రా ఫాం పూర్తిచెయ్యడం కూడా తెలియదు. ఇన్ని కష్టాలు పడటానికి కారణం చంద్రబాబు నాయుడు, రమేష్ కుమార్‌లే. వారికి తగిన గుణపాఠం ఓటు ద్వారా చెపుతాం.

–అధికారపు రాంబాబు, దివ్యాంగుడు, గుడివాడ

పోస్టల్ బ్యాలెట్‌కు సర్వం సిద్ధం



అధికారులకు సూచనలు ఇస్తున్న కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ

- నేటి నుంచి ప్రారంభం
- పోస్టల్ బ్యాలెట్ వినియోగించనున్న 20,641 మంది
- నియోజకవర్గాల వారీగా ఫెసిలిటేషన్ సెంటర్లు
- ఇతర జిల్లాలకు చెందిన వారి కోసం బందరులో ఫెసిలిటేషన్ కేంద్రం

చిలకలపూడి(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకుంది. గత సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును ఉద్యోగులు పోస్టు ద్వారా వినియోగించుకున్నారు. ప్రస్తుతం ఉద్యోగులు తమ ఓటు హక్కును ఫెసిలిటేషన్ సెంటరుకు వెళ్లి స్వయంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. దీనికి ఆయా విభాగాల్లో పని చేస్తున్న వారు 20,641 మందిని గుర్తించారు. వీరందరూ ఒకేసారి ఓటు హక్కు వినియోగించుకోకుండా విభాగాల వారీగా షెడ్యూల్‌ను ఏర్పాటు చేశారు.

విభాగాల వారీగా.. తేదీలు..

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయటంతో పాటు తేదీల వారీగా ఉద్యోగులను విభజించి ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, సూక్ష్మ పరిశీలకులకు, 5వ తేదీ అదర్ పోలింగ్ ఆఫీసర్లు, 6వ తేదీ పోలీస్, అటెండర్లు, డ్రైవర్లు, వీడియోగ్రాఫర్లు, ఇతరులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నారు. ఈ మూడు తేదీల్లో ఓటు హక్కు వినియోగించుకోలేని వారికి 7, 8 తేదీల్లో ఆయా ఫెసిలిటేషన్ కేంద్రాల వద్దకు వెళ్లి ఓటు వేసే అవకాశం కల్పించారు.

నియోజకవర్గాల వారీగా ఫెసిలిటేషన్ కేంద్రాలు

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆయా నియోజకవర్గాల వారీగా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గన్నవరం నియోజకవర్గానికి సంబంధించి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, గుడివాడ నియోజకవర్గానికి సంబంధించి వీకేఆర్‌వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల, పెడన నియోజకవర్గానికి నందమూరులోని వాసవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల, మచిలీపట్నం నియోజకవర్గానికి నోబుల్ కళాశాల, అవనిగడ్డ నియోజకవర్గానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పామర్రు నియోజకవర్గానికి ఎస్‌కేఆర్‌ఆర్ జెడ్పీ హైస్కూల్, పెనమలూరు నియోజకవర్గానికి పెనమలూరులోని జెడ్పీ హైస్కూల్‌తో పాటు వేరే జిల్లాలో ఓటు హక్కు ఉండి ఈ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న వారికి మచిలీపట్నంలోని పాండురంగ మునిసిపల్ హైస్కూల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఫెసిలిటేషన్ కేంద్రం పరిశీలన

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియకు ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. మచిలీపట్నంలోని నోబుల్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియకు కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రక్రియ సజావుగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

దుర్గమ్మ ఆలయం.. ఇక స్వర్ణశోభితం

- పూర్తి ఆలయానికి బంగారు తాపడం
- సుమారు 70 కిలోల బంగారం అవసరం
- దాతల నుంచి విరాళాల సేకరణ



బంగారు తాపడం పోస్టర్‌ను ఆవిష్కరించిన కమిషనర్ సత్యనారాయణ, ఈఓ రామరావు(ఫైల్)




అమ్మవారి ఆలయం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయం ఇక స్వర్ణశోభితం కానుంది. 2008లో అప్పటి ఈవో చంద్రకుమార్ నేతృత్వంలో 88 కిలోల బంగారంతో ఆలయ శిఖరానికి బంగారం తాపడం పనులు పూర్తి చేశారు. తాజాగా అమ్మవారి ఆలయాన్ని పూర్తి స్థాయిలో బంగారు తాపడం చేయించేందుకు ఈవో కె.ఎస్.రామరావు నడుం బిగించారు. ప్రస్తుతం అమ్మవారి శిఖరం రూఫ్ లెవల్ వరకు బంగారు తాపడం ఉంది. రూఫ్ లెవల్ నుంచి ఫ్లోరింగ్ లెవల్ వరకు బంగారు తాపడం చేయించాలని అధికారులు భావిస్తున్నారు. తాజాగా గత శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డోనర్ సెల్‌లో బంగారు తాపడం పనులకు విరాళాల సేకరణను చేపట్టారు. దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పోస్టర్‌ను ఆవిష్కరించి భక్తుల నుంచి విరాళాలు స్వీకరించారు. తొలి రోజే సుమారు రూ.13 లక్షల విరాళాలు అందాయి. ఆలయం పూర్తి స్థాయిలో బంగారు తాపడం చేయించేందుకు సుమారు 70 కిలోల బంగారం అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే మల్లేశ్వరస్వామి ఆలయ శిఖరానికి కూడా బంగారు తాపడం చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.

బ్యాంకుల్లో 195 కిలోల బంగారం

శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానానికి బ్యాంకుల్లో 195 కిలోల మేర బంగారు నిల్వలు ఉన్నాయి. ఆయా బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో ఉన్న ఈ బంగారం నుంచి ఏటా రూ.2 కోట్ల మేర వడ్డీ రూపేణా దేవస్థానానికి ఆదాయం లభిస్తోంది. మరో వైపు నిత్యం భక్తులు అమ్మవారికి ఆభరణాల రూపంలో బంగారాన్ని కానుకగా సమర్పిస్తున్నారు. ఇలా సమర్పించిన బంగారం మరో 8 కిలోలను దేవస్థాన లాకర్‌లో భద్రపరిచారు.




10న దుర్గమ్మ సన్నిధిలో మహాలక్ష్మీయాగం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అక్షయ తృతీయను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో 10వ తేదీ శుక్రవారం మహాలక్ష్మీ యాగం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కేఎస్ రామరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి విగ్రహం వద్ద మహాలక్ష్మీ యాగాన్ని నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది. యాగంలో పాల్గొనే ఉభయదాతలు రూ. 1000 టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సేవలో పాల్గొనే ఉభయదాతలకు శేషవస్త్రం, రవిక, పెద్ద లడ్డూ, చక్రపొంగలి, పులిహోర ప్యాకెట్‌ను ప్రసాదంగా అందజేస్తారు. ఇక 12వ తేదీ శంకర జయంతిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రావిచెట్టు వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఆది శంకరాచార్యుల విగ్రహానికి ఆలయ అర్చకులు అభిషేకాలు, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు నగరోత్సవ సేవ జరుగుతుంది.

ప్రచార పర్వం



అభివాదం: గుడివాడ నియోజకవర్గంలో శుక్రవారం అభిమానులతో కలిసి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) - గుడివాడ



విజయీభవ: బంటుమిల్లిలో శుక్రవారం జరిగిన రోడ్డు షోలో వైఎస్సార్ సీపీ బందర్ లోక్‌సభ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, పెడన అసెంబ్లీ అభ్యర్థి ఉప్పాల రాము - బంటుమిల్లి



స్పీడ్‌గా.. బందరు నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన రోడ్ షోలో వైఎస్సార్ సీపీ మచిలీపట్నం అభ్యర్థి పేర్ని కిట్టు ఎన్నికల గుర్తు ఫ్యాన్‌ను చూపుతూ ప్రచారం - మచిలీపట్నం టౌన్

క్లుప్తంగా

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



పమిడిముక్కల: మండలంలోని తాడంకి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ జొన్నలగడ్డ వెంకట నారాయణ(54) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందారు. ఉయ్యూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటనారాయణ అస్వస్థతకు గురై గుండెపోటుతో మరణించారు. అతని భౌతికకాయాన్ని తాడంకిలోని స్వగృహానికి తరలించారు. కంకిపాడు సీఐ శ్రీనివాసరావు, ఉయ్యూరు రూరల్ ఎస్ఐ అవినాష్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్, ప్రతినిధులు బెనర్జీ బాబు, సురేంద్ర, సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కూచిపూడి శ్రీలక్ష్మి తదితరులు కానిస్టేబుల్ వెంకటనారాయణ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వెంకటనారాయణ భౌతికకాయానికి పోలీస్ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించారు. మృతుడి కుటుంబ సభ్యులకు పోలీస్ అధికారుల సంఘం రూ.90 వేల ఆర్థిక సాయం చేసింది.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

గూడపాడు(మొవ్వ): భర్త, అత్తింటివారి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మొవ్వ మండలంలోని గూడపాడులో జరిగింది. కూచిపూడి ఎస్ఐ టి.శ్రీనివాస్ కథనం మేరకు.. గూడపాడుకు చెందిన ఈడే సాంబశివరావుకు దుర్గాభవాని(30)తో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త సాంబశివరావు, అత్త ఈడే దుర్గ, ఆడపడుచు సామ్రాజ్యం వేధింపుల కారణంగా గురువారం సాయంత్రం ఇంటిలోనే దుర్గాభవానీ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతిరాలి తల్లి కొండేటి లక్ష్మి ఫిర్యాదు మేరకు కూచిపూడి పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోల్‌ప్లాంట్ ప్రమాదంలో కార్మికురాలికి గాయాలు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ కోల్‌ప్లాంట్‌లో రైలు ఢీకొని మహిళా కార్మికురాలు తీవ్రంగా గాయపడింది. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదంలో గాయపడిన మహిళను విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు రెండు కాళ్లు తొలగించినట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన దారావత్ కోటేశ్వరి కుటుంబం బతుకుదెరువు కోసం మండలంలోని కిలేశపురం గ్రామానికి మూడేళ్ల క్రితం వచ్చింది. కూలి పనులు చేసుకునే కోటేశ్వరి మూడు రోజుల క్రితం ఎన్టీటీపీఎస్ ప్లాంట్‌లో పనిలో చేరింది. విధి నిర్వాహణలో ఉండగా లోకో ట్రైన్ ఢీకొట్టింది. రెండు కాళ్ల మీదుగా ట్రైన్ వెళ్లింది. దీంతో కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. చికిత్స నిమిత్తం విజయవాడ వైద్యశాలకు తరలించగా రెండు కాళ్లు తొలగించినట్లు తెలిసింది. చేతికి గాయమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీఎం వైఎస్ జగన్ పాలనలో తగ్గిన పేదరికం

- బెజవాడ అంటే నాకు ప్రాణం
- మళ్లీ నేనే ఎంపీగా గెలుస్తా
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదరికం పూర్తిగా తగ్గిందని విజయవాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇందుకు కారణమన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన మాట్లాడుతూ.. ప్రజల తలసరి ఆదాయం, వృద్ధిరేటు పెరిగాయని పేర్కొన్నారు. అభివృద్ధి లేదని ప్రతిపక్షాలు చేస్తున్న వాదనలో పసలేదని తేల్చిచెప్పారు. ఈ ఐదేళ్లలో అభివృద్ధి వికేంద్రీకరణకు అడుగులు పడ్డాయన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ అందుబాటులోకి వచ్చాయని వివరించారు. ఇది అభివృద్ధి కాదా అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు.

అభివృద్ధే జెండా.. అజెండా

బెజవాడ అంటే తనకు ప్రాణమని, తన జెండా, అజెండా విజయవాడ అభివృద్ధేనని కేశినేని నాని పేర్కొన్నారు. దుర్గగుడి, బెంజ్ సర్కిల్ మొదటి ఫ్లై ఓవర్ నిర్మాణానికి తాను కృషి చేశానన్నారు. నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మరో సంవత్సర కాలంలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తవుతుందన్నారు. ఇప్పటికే వెస్ట్ బైపాస్ పూర్తయిందని,



మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న కేశినేని నాని

ఈస్ట్ బైపాస్ నిర్మాణంపై సీఎం వైఎస్ జగన్‌తో చర్చించానని తెలిపారు. పదేళ్లుగా ప్రజలకు కేశినేని నానీ అంటే ఏమిటో తెలుసన్నారు. ఎంపీగా విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని వివరించారు. టాటా ట్రస్ట్ ద్వారా 11 లక్షల మందికి ఉచితంగా వైద్య సేవలు అందించామన్నారు. అమరావతిలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేస్తానని చంద్రబాబు చెప్పారని, తాను ఆ రోజు ఆయనకు ఎదురు తిరిగి గన్నవరం ఎయిర్‌పోర్టు విస్తరణ చేయించానని పేర్కొన్నారు. తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, నిరూపించాలని సవాల్ విసిరారు. మళ్లీ విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

వలంటీర్ వ్యవస్థను అవమానించ లేదా?

2019లో సీఎం వైఎస్ జగన్ వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేస్తే ఇదే చంద్రబాబు వలంటీర్లను అవమానిస్తూ వ్యాఖ్యలు చేశారని కేశినేని నాని గుర్తు చేశారు. ఎన్నికల వచ్చే సరికి ఆ వ్యవస్థ భేష్ అంటూ పొగుడుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు చేస్తే సంసారం.. ఇతరులు చేస్తే ఏదో అన్నట్లుగా ఆయన తీరు ఉందని ఎద్దేవాచేశారు.

ఏ ఒక్క హామీ అమలు చేయని బాబు

'2014 ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు 650 హామీలు ఇచ్చాడు. ఏ ఒక్కటీ అమలు చేయలేదు. అప్పుడు బీజేపీతో టీడీపీ పొత్తులోనే ఉంది. అందుకే వాళ్లు ఏనాడు చంద్రబాబును నమ్మలేదు. పైగా నరేంద్రమోదీని వ్యక్తిగతంగా దూషించాడు. టీడీపీని బీజేపీ నమ్మే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు, పవన్ విడుదల చేసిన మేనిఫెస్టోలో బీజేపీ భాగస్వామి కాలేదు' అని కేశినేని నాని అన్నారు.

ప్రజలు తిరస్కరించిన వ్యక్తి వారసుడా?

'నారా లోకేష్ 2014లో తండ్రి పదవిని అడ్డుపెట్టుకుని ఎమ్మెల్సీ అయ్యాడు. మంత్రి అయ్యాడు. పార్టీ వనరులు, పార్టీ, తాత, తండ్రుల పేర్లు వాడుకున్నాడు. అయినా 2019లో ప్రజలు లోకేష్‌ను తిరస్కరించారు. అటువంటి వ్యక్తిని తీసుకొచ్చి పార్టీలో నా వారసుడు అంటే ఎలా నడుస్తుంది' అని చంద్రబాబును కేశినేని నాని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాంగ్రెస్‌ను ఎదురించి నిలబడి ప్రజలను మెప్పించారని, 151 సీట్లతో ముఖ్యమంత్రిగా బాధ్యలు చేపట్టారని వివరించారు.

15 మంది చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్స



శస్త్ర చికిత్సలు చేసిన చిన్నారులతో యూకేకు చెందిన వైద్యుల బృందం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని ఆంధ్రా హాస్పిటల్‌లో ఏప్రిల్ 29 నుంచి మే నాలుగో తేదీ వరకు నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో 15 మంది చిన్నారులు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలను విజయవంతంగా చేశామని ఆస్పత్రి పిడియాట్రిక్ చీఫ్ డాక్టర్ పి.వి. రామారావు తెలిపారు. సూర్యారావుపేటలోని ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ రామారావు మాట్లాడుతూ.. అత్యంత క్లిష్ట తరమైన గుండె సమస్యలు ఉన్న చిన్నారులకు యూకేకు చెందిన వైద్య నిపుణులతో శస్త్ర చికిత్సలు చేయించామని తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలను ఆంధ్రా హాస్పిటల్స్, హీలింగ్ లిటిల్ హార్ట్స్, యూకే చారిటీ సౌజన్యంతో ఉచితంగా చేశామని వివరించారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రత్యేక శిబిరంలో యూకేకు చెందిన పిడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ ఆంధ్రూ పార్, పిడియాట్రిక్ కార్డియాక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ డొరొతి లిడ్ బెటర్, డాక్టర్ ఒరిజిత్ బెనర్జీతో పాటు హెలీ ఫిట్జ్ పాట్రిక్, అలెగ్జాండ్రా టేలర్ వంటి సిబ్బంది పాల్గొని గుండె సర్జరీలను విజయవంతంగా చేశారని వివరించారు. ఇప్పటి వరకూ 29 ప్రత్యేక శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రా హాస్పిటల్ పిడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ విక్రమ్ కుడుముల, డాక్టర్ సాయిరామ్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ జె.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉరుసుకు దర్గా ముస్తాబు



గూడూరులోని హజ్రత్ నిర్గన్ షా ఔలియా



దర్గాలోని హజ్రత్ నిర్గన్ షా ఔలియా సమాధి

గూడూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గూడూరులోని హజ్రత్ నిర్గన్‌షా ఔలియా దర్గా ఉరుసుకు ముస్తాబయింది. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు రెండు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. మొదటి రోజు గంధ మహోత్సవం, సోమవారం దీపారాధన జరుగుతాయి.

మతసామరస్యానికి ప్రతీక

హజ్రత్ నిర్గన్‌షా ఔలియా దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ దర్గాకు ముస్లింలతో పాటుగా హిందువులు కూడా పెద్ద సంఖ్యలో వస్తారు. బాబాకు మొక్కుబడులు సమర్పిస్తుంటారు. ఉత్సవాలు జరిగే రెండు రోజులూ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంటుంది. ఉమ్మడి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు తరలివచ్చి దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాలలో స్థిర పడిన బంధుగణం అంతా తరలి రావడంతో ఏ ఇంట చూసినా సందడి సందడిగా ఉంటుంది.

మొదటి రోజు..

ఉత్సవాలలో భాగంగా మొదటిరోజు గంధ మహోత్సవం నిర్వహిస్తారు. దీనిలో భాగంగా బాబా ప్రతీకను, గుర్రాన్ని మేళతాళాల మధ్య ఊరేగిస్తారు. దర్గా నుంచి ప్రారంభమయ్యే ఊరేగింపు పురవీధుల్లో సంచరిస్తూ తెల్లవారుజామున తిరిగి దర్గాకు చేరుకుంటుంది. ఈ సందర్భంగా యువకులు చేసే కర్రసాము ఆకట్టుకుంటుంది.

రెండో రోజు..

రెండో రోజు దీపారాధన నిర్వహిస్తారు. దీనిలో భాగంగా కాంపిటీషన్ కవ్వాలి ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా కర్నాటకకు చెందిన రజియా సుల్తానా, ముంబాయికి చెందిన సుల్తాన్ నాజ్ బృందంతో కవ్వాలీ ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి పది గంటలకు ప్రారంభమయ్యే కవ్వాలీ తెల్లవారుజాము వరకు సాగుతుంది.

భార్యను చంపిన కేసులో భర్తకు యావజ్జీవ శిక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): భార్యను చంపిన కేసులో భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు గురువారం తీర్పు చెప్పారు. నిడుమోలు గ్రామానికి చెందిన కోట దుర్గారావు 2015లో మరియమ్మను వివాహం చేసుకున్నాడు. కొంత కాలం తరువాత దుర్గారావు గడ్డ యల్లమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దుర్గారావు యల్లమ్మతో ఎక్కువగా ఉండటంతో మరియమ్మ నిలదీసింది. 2020 మే ఐదో తేదీ రాత్రి సమయంలో దుర్గారావు మద్యం తాగి భార్య మరియమ్మను గొంతు నులిమి చంపాడు. అనంతరం ఆత్మహత్యగా చిత్రీకరించాడు. దీనిపై కూచిపూడి పోలీస్‌స్టేషన్‌లో మరియమ్మ బంధువులు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదైంది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సియాద్రి చిన్నారావు తొమ్మిది మంది సాక్షులను ప్రవేశపెట్టారు. విచారణలో దుర్గారావు భార్యను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడని రుజువు కావటంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు బెయిల్ మంజూరు

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరంలోని ఎనిమిదో డివిజన్‌లో ఈ నెల రెండో తేదీన వైఎస్సార్ సీపీ, జనసేన కార్యకర్తల మధ్య జరిగిన వివాదానికి సంబంధించిన కేసులో వైఎస్సార్ సీపీ నాయకులకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, స్పెషల్ కోర్టు జడ్జి దేవి సాయి శ్రీవాణి బెయిల్ మంజూరు చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తితో పాటు చలమలశెట్టి గాంధీ, చలమలశెట్టి శ్రీనివాసరావు (శీనయ్య), లంకే రమేష్, బొమ్మసాని ధన కుమార్, చిలంకుర్తి సాయివినయ్‌పై మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం నేరం కేసు నమోదు చేశారు. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్‌కు చెందిన న్యాయవాదులు పేర్ని సురేష్, మట్టా రామదాసు, మొహమ్మద్ రఫీ, రాజగురు వాదనలు వినిపించారు. హత్యాయత్నంగా సెక్షన్‌ను నమోదు చేయడం రాజకీయ దురుద్దేశమని, హత్యాయత్నానికి సంబంధించిన ఆయుధాలు, ఆధారాలు లేవని వాదనలు వినిపించారు. న్యాయవాదుల వాదనలు విన్న న్యాయమూర్తి ఆరుగురికి బెయిల్ మంజూరు చేశారు.

48 గంటల ముందు మద్యంషాపులు మూసివేయాలి

కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్, కౌంటింగ్ తేదీలకు 48 గంటల ముందు మద్యం షాపులు మూసివేసి డ్రైడే గా పాటించాలని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.కె.బాలాజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మే 13వ తేదీకి 48 గంటల ముందు అంటే 11వ తేదీ సాయంత్రం ఆరు నుంచి 13వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు, బార్‌లను మూసివేసి డ్రైడేగా పాటించాలని స్పష్టంచేశారు. ఓట్ల లెక్కింపు రోజైన జూన్ నాలుగో తేదీకి 48 గంటల ముందు లెక్కింపు జరిగే ప్రదేశాల వద్ద డ్రై డే పాటించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ ఉత్తర్వులు అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కొనసాగుతున్న ఈవీఎంల కమిషనింగ్



పెనమలూరు: మండలంలోని గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో ఈవీఎంల కమిషనింగ్ కొనసాగుతోంది. కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.కె.బాలాజీ గురువారం ఇంజినీరింగ్ కాలేజీకి వచ్చి ఈవీఎంల కమిషనింగ్‌పై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో సిబ్బంది కమిషనింగ్ ప్రక్రియను వేగవతం చేశారు. పెనమలూరు నియోజకవర్గంలో 306 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అసెంబ్లీకి 306, పార్లమెంట్‌కు 306 చొప్పున మొత్తం 612 ఈవీఎంలు అవసరం. రెండింటికి 20 శాతం చొప్పున అదనంగా ఈవీఎంలను అందుబాటులో ఉంచుకోవాలి. అంటే అసెంబ్లీ, పార్లమెంట్‌కు కలిపి 110 ఈవీఎంలు అదనంగా అందుబాటులో ఉండాలి. సాంకేతిక పరమైన ఇబ్బందులు వచ్చినప్పుడు అందుబటులో (రిజర్వు) ఉన్న ఈవీఎంలు ఉపయోగిస్తారు. వీవీ ప్యాట్‌లు కూడా 306 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తారు. వాటికి 30 శాతం వీవీ ప్యాట్‌లు అందుబాటులో ఉంచుతారు. కమిషనింగ్‌లో భాగంగా ఈవీఎంలకు ఆయా పార్టీల ఎన్నికల గుర్తులు లోడ్ చేస్తారు. కమిషనింగ్ మరో రెండు రోజులు ఉంటుందని అధికారులు తెలిపారు. ఆర్‌ఓ డి.రాజు, ఏఆర్‌ఓలు ప్రసాద్, కుమార్‌బాబు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం నిల్వచేసిన టీడీపీ నేతలపై కేసు



మద్యం అక్రమ నిల్వచేసిన టీడీపీ నాయకులు , మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ అధికారులు

తిరువూరు: ఎన్నికల సందర్భంగా ఓటర్లకు పంపిణీ చేయడానికి తెలంగాణ నుంచి మద్యం సీసాలు తెచ్చి నిల్వచేసిన తెలుగుదేశం పార్టీ నాయకులపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం మేరకు.. అక్కపాలెం గ్రామంలోని నెక్కళపూడి శ్రీనివాసరావు ఇంటి ఆవరణలోని గడ్డివామిలో తెలంగాణ మద్యం సీసాలను నిల్వ చేసినట్లు సమాచారం అందుకుని ఎస్ఈబీ సిబ్బంది దాడిచేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఈ మద్యం సీసాలు తెచ్చినట్లు గుర్తించామని పేర్కొన్నారు. అక్కపాలెంనకు చెందిన నెక్కళపూడి శ్రీనివాసరావు, కుక్కా దినేష్ గౌడ్ వీటిని నిల్వ చేసినట్లు నిర్ధారించామన్నారు. రోలుపడికి చెందిన కిలారు రమేష్ కొన్ని మద్యం సీసాలను తీసుకెళ్లినట్లు గుర్తించి ముగ్గురిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. 480 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని శ్రీనివాసరావు, దినేష్‌గౌడ్‌ను అరెస్టు చేశామని, కిలారు రమేష్ పరారీలో ఉన్నారని అశోక్ తెలిపారు. తెలంగాణ మద్యం ఎవరైనా నిల్వ చేసినా, విక్రయించినా తమకు సమాచారం ఇస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ) ... విశ్వాసానికి మరో పేరు !

CIRCLE SASTRA CENTRE
27-33-40, మొదటి అంతస్తు, గూడవల్లి వారి వీధి, బీసెంట్ రోడ్ క్రాస్, గవర్నర్‌పేట, విజయవాడ-520002, ఫోన్ : 9831200669, E-Mail: cs8332@pnb.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 9(1)తో చదువుకోవలసిన రూలు 8(6) ప్రకారం సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డు క్రెడిటార్ గారికి తనఖా ఉంచిన/ఛార్జిలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా/భౌతికంగా / లాంఛనాత్మకంగా బ్యాంకు అధీకృత అధికారిగారు సెక్యూర్డు క్రెడిటార్ గారు స్వాధీనత తీసుకుని వాటిని "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై" దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు / సెక్యూర్డు క్రెడిటార్ గారు సదరు ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వు ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

ఋణగ్రహీత పేరు: మెస్సర్స్ రాధామాధవ్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్,
(ఖాతా నెం: 3629009300017417 & 362900PD00000941), బ్రాంచ్ ఆఫీస్: సూర్యారావుపేట, విజయవాడ-(362900)

ఆర్‌యస్ నెం.63/13, 63/14, 63/15, 63/16, డి.నెం.5-110, నేషనల్ హైవే నెం.5, ప్రసాదంపాడు గ్రామం, విజయవాడ-521108.

డైరెక్టర్లు మరియు వ్యక్తిగత హామీదారులు: మాగంటి సుబ్రహ్మణ్యం, మాగంటి చంద్రమౌళి, మాగంటి వేణు గోపాల్, మాగంటి వెంకట శ్రీనివాస్, మాగంటి మధుసూధన శర్మ.

1) మెస్సర్స్ రాధామాధవ్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆర్‌యస్ నెం.63/13, 63/14, 63/15, 63/16, డి.నెం.5-110, నేషనల్ హైవే నెం.5, ప్రసాదంపాడు గ్రామం, విజయవాడ-521108. 2) శ్రీ మాగంటి సుబ్రహ్మణ్యం (లేటు) (మేనేజింగ్ డైరెక్టర్), తండ్రి : లేటు ఎమ్. వెంకటేశ్వర్లు, ఇ.నెం.40-15-8/2, నందమూరి వారి వీధి, బృందావన్ కాలనీ, లబ్బీపేట, విజయవాడ - 520010. 3) శ్రీ మాగంటి చంద్రమౌళి (డైరెక్టర్), తండ్రి : ఎమ్. సుబ్రహ్మణ్యం, ఇ.నెం.40-15-8/2, నందమూరి వారి వీధి, బృందావన్ కాలనీ, లబ్బీపేట, విజయవాడ - 520010. 4) శ్రీ మాగంటి వేణు గోపాల్ (డైరెక్టర్), తండ్రి : ఎమ్. సుబ్రహ్మణ్యం, ఇ.నెం.40-15-8/2, నందమూరి వారి వీధి, బృందావన్ కాలనీ, లబ్బీపేట, విజయవాడ - 520010. 5) శ్రీ మాగంటి వెంకట శ్రీనివాస్ (డైరెక్టర్), తండ్రి : ఎమ్. సుబ్రహ్మణ్యం, ఇ.నెం.40-15-8/2, నందమూరి వారి వీధి, బృందావన్ కాలనీ, లబ్బీపేట, విజయవాడ - 520010. 6) శ్రీ మాగంటి మధుసూదన శర్మ (అడిషనల్ డైరెక్టర్), తండ్రి : ఎమ్. సుబ్రహ్మణ్యం, ఇ.నెం.40-15-8/2, నందమూరి వారి వీధి, బృందావన్ కాలనీ, లబ్బీపేట, విజయవాడ - 520010.7. శ్రీమతి శారదా దేవి (చట్టరీత్యా వారసురాలు), భర్త : లేటు శ్రీ మాగంటి సుబ్రహ్మణ్యం - మేనేజింగ్ డైరెక్టర్, తండ్రి : లేటు ఎమ్. వెంకటేశ్వర్లు, ఇ.నెం.40-15-8/2, నందమూరి వారి వీధి, బృందావన్ కాలనీ, లబ్బీపేట, విజయవాడ - 520010.

డిమాండ్ నోటీసు తేది:06.06.2022, ఈ అమ్మకం నోటీసు జారీ చేసిన ప్రకారం **తేది.29-02-2024** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.55,87,00,892.91 పై.** (అక్షరాల యాభై ఐదు కోట్ల ఎనభై ఏడు లక్షల ఎనిమిది వందల తొంభై రెండు రూపాయల తొంభై ఒక్క పైసలు మాత్రమే) + **తేది. 01-03-2024** నుండి తదుపరి వడ్డీ, ఛార్జీలు మరియు వ్యయాలు (డిమాండ్ నోటీసు తరువాత ఏవైనా చెల్లింపు ఉన్న యెడల మినహాయించబడును).

భౌతిక స్వాధీనతా తేది : 07-12-2022

బయానా చెల్లింపునకు ఆఖరు తేది : 18-05-2024, సాయంత్రం 4 గం॥ల లోపు	బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,00,000/-

ఇ -వేలం తేది మరియు సమయం : 20-05-2024 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు

సెక్యూరిటీ / అస్తుల వివరాలు మరియు అస్తుల యజమాని / తనఖా పెట్టిన వ్యక్తి పేరు	రిజర్వు ధర	బయానా (ఇఎమ్‌డి)
శ్రీ మాగంటి సుబ్రహ్మణ్యం, తండ్రి: లేటు మాగంటి వెంకటేశ్వర్లు వారి పేరున గల ఆస్తి: డాక్యుమెంట్ నెం.1718/2004, తేది:28-04-2004, డాక్యుమెంట్ నెం.2526/2002, తేది:09-10-2002, డాక్యుమెంట్ నెం.2527/2002, తేది:09-10-2002, డాక్యుమెంట్ నెం.2528/2002, తేది:09-10-2002, డాక్యుమెంట్ నెం.2529/2002, తేది:09-10-2002, డాక్యుమెంట్ నెం.2530/2002, తేది: 09-10-2002, డాక్యుమెంట్ నెం.2531/2002, తేది:09-10-2002, డాక్యుమెంట్ నెం.3215/2002, తేది:19-12-2002 మరియు డాక్యుమెంట్ నెం.3217/2002, తేది:19-12-2002, ప్రకారం: కృష్ణా జిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రార్, విజయవాడ రూరల్ మండలం, ప్రసాదంపాడు గ్రామ పంచాయితీ ఏరియా, ప్రసాదంపాడు గ్రామం, ఆర్‌యస్ నెం.63/13, 63/14, 63/15, 63/16లోని 7381 చ॥గ॥ల భూమి మరియు అందు గల ఆర్‌సిసి భవనంనకు హద్దులు: తూర్పు: సీడ్స్ కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్ వారి ఆస్తి, దక్షిణం: నేషనల్ హైవే రోడ్డు, పడమర: 15.00 అ॥ల పంచాయితీ రోడ్డు, ఉత్తరం: రైవాస్ కాలువ గట్టు. పైన తెలిపిన హద్దుల మధ్య గల 7381 చ॥గ॥ల స్థలం అందు గల ఆర్‌సిసి భవనం అన్ని ఈజీమెంట్ హక్కులతో కలదు.	రూ. 60,66,00,000/-	రూ. 6,06,60,000/-

నియమ నిబంధనలు:
1. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును.
2. ఆస్తులను 'ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై" విక్రయించబడతాయి.
3. అధీకృత అధికారి గారి వద్దగల పైన తెలిపిన షెడ్యూలులోని సెక్యూర్డు ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారి సమాధానం తెలుపవలసిన అవసరం లేదు.
4. అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://www.mstcecommerce.com ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది. 20-05-2024 ఉదయం 11.00 గం॥ల నుండి సా॥4.00 గం॥ల వరకు నిర్వహించబడును.
5. అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయచేసి https://www.ibapi.in, https://eprocure.gov.in/epublish/app,http://www.mstcecommerce.com/, www.pnbindia.in, వెబ్‌సైటులు చూడవలెను.

తేది : 30-04-2024
ప్రదేశం : విజయవాడ

SARFAESI చట్టం 2002 లోని రూలు 9 (1) తో చదువుకోవలసిన రూలు 8(6) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

సం/- అధీకృత అధికారి
పంజాబ్ నేషనల్ బ్యాంక్

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న వలసలు



గన్నవరం: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. టీడీపీ మహిళా విభాగం మండల ఉపాధ్యక్షురాలు మోదుగుమూడి రాజేశ్వరి నేతృత్వంలో 30 మంది మహిళలు శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి వంశీమోహన్ పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి, అభ్యున్నతికి పెద్దపీట వేసిందన్నారు. మహిళల పేరున నివేశన స్థలాలను పంపిణీ చేసి రూ.లక్షల విలువైన ఆస్తికి హక్కుదారులను చేసిందని గుర్తుచేశారు. మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనతో పాటు ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు మోదుగుమూడి వెంకటేశ్వరరావు, దారం దుర్గావరప్రసాద్, లుక్కా సురేష్, ముతకన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంలో ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ ఎన్నికల ప్రచారంలో ఎన్టీటీపీఎస్ పర్మినెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొంటూ యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనవద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అయినప్పటికీ వాటిని బేఖాతరు చేస్తూ ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు పసుపు చొక్కాలు ధరించి మరీ టీడీపీ ప్రచారంలో పాల్గొని తమ భక్తిప్రపత్తులను చాటుకుంటున్నారు. ఇటీవల ఓ ఉద్యోగి వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను ప్రసన్నం చేసుకోవడంపై సంస్థ యాజమాన్యం నోటీసులు జారీచేసింది. మరో ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్ భర్త కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఉంటూ అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్, ఆయన సతీమణి వసంత శిరీష ప్రచారంలో పాల్గొంటున్నారు. మరో ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్ భర్త ఎన్టీటీపీఎస్‌లో ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ వారి వార్డులో ప్రచార బాధ్యతలు నెత్తికెత్తుకున్నారు. స్వచ్ఛందంగా సేవలు చేస్తున్న వలంటీర్లను అడ్డుకున్న టీడీపీ నాయకులు ఉద్యోగులను ప్రచారానికి వాడుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ వేతనం పొందుతూ కోడ్ ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ నెల 11 నుంచి 144 సెక్షన్ అమలు

చిలకలపూడి(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 11వ తేదీ నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 13వ తేదీన పోలింగ్ ప్రక్రియ శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సంఘ వ్యతిరేక శక్తుల జోక్యాన్ని అరికట్టడానికి 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ సెక్షన్ ప్రకారం ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడి ఉండకూడదన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు, ఊరేగింపులు, ప్రచారాలు నిషేధమని కలెక్టర్ తెలిపారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 11 నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు అమలులో ఉంటాయన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరేందుకు ముందుకు రావడం చాలా ఆనందంగా ఉందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. 17వ డివిజన్ రాణిగారితోటలో గుడ్ మార్నింగ్ హోటల్ సమీపంలో శుక్రవారం రాత్రి స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అవినాష్ సమక్షంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన యువనాయకులు సత్తిబాబు, ప్రశాంత్, నాగరాజు ఆధ్వర్యంలో వారి మిత్రబృంద కుటుంబ సభ్యులు సుమారు 200 మంది పార్టీలో చేరారు. వారందరికీ అవినాష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పించి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో అందరి మద్దతుతో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



మచిలీపట్నం కోనేరు సెంటర్

రోల్డ్‌గోల్డ్ పరిశ్రమ కేంద్రంగా గుర్తింపు

- పోర్టు నిర్మాణంతో అభివృద్ధి పరుగులు
- మెడికల్ కళాశాల నిర్మాణంతో కార్పొరేట్ తరహా వైద్యం
- ఫిషింగ్ హార్బర్‌తో మత్స్యకారులకు ఉపాధి
- జాతీయ రహదారుల అభివృద్ధితో మెరుగైన రవాణాసౌకర్యం

నియోజకవర్గ మచిలీపట్నం ముఖచిత్రం

తీర నగరం చరిత ఘనం

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో మచిలీపట్నం నియోజకవర్గ చరిత్ర ఘనమైనది. కృష్ణా జిల్లాకు కేంద్రంగా బందరు విరాజిల్లుతోంది. ఈ ప్రాంతం రోల్డ్‌గోల్డ్ పరిశ్రమ కేంద్రంగా గుర్తింపు పొందింది. బందరు మునిసిపాలిటీ దేశంలోనే రెండో మునిసిపాలిటీగా ఆవిర్భవించింది. 1952 నుంచి అసెంబ్లీ నియోజకవర్గంగా కొనసాగుతోంది. తొలిగా 1952లో జి.ఆంజనేయులు సీపీఐ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

నగరీకరణ

నియోజకవర్గంలో మచిలీపట్నం కార్పొరేషన్‌గా రూపాంతరం చెందడంతో నగరీకరణ దిశగా అడుగులు వేస్తోంది. జిల్లాల పునర్విభజన అనంతరం కలెక్టరేట్ ప్రాధాన్యం పెరగడంతో అధికారులు, ఉద్యోగులు, ప్రజల రాకపోకలు పెరిగాయి. మచిలీపట్నం –విజయవాడ జాతీయ రహదారి, కత్తిపూడి –ఒంగోలు జాతీయ రహదారి, మచిలీపట్నం – కల్లూరు రహదారులు అభివృద్ధి జరగడంతో రవాణా సౌకర్యం మెరుగైంది. నగరంలో సూపర్ మార్కెట్లు, షాపింగ్‌మాల్స్, ఎలక్ట్రానిక్ మాల్స్ ఏర్పాటుతో వ్యాపారపరంగా వృద్ధి చెందింది.

చిలకలపూడి బంగారంగా..

బందరు ప్రాంతంలో అత్యధిక జనాభా ఆధారపడి పనిచేసే రోల్డ్‌గోల్డ్ పరిశ్రమకు ఎంతో ప్రాధాన్యముంది. 'చిలకలపూడి బంగారం'గా ఇది దేశంలో పేరు గడించింది. బంగారం ధర భారీగా పెరుగుతుండటంతో ఈ నగలపై మహిళలకు మక్కువ అధికమవుతోంది. దీంతో ఈ రంగం దినదినాభివృద్ధి చెందుతోంది. వీటిని కొనుగోలు చేసేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు, వినియోగదారులు వస్తుంటారు. వివిధ రకాల నూతన డిజైన్లతో వినియోగదారులను ఆకట్టుకునేందుకు పరిశ్రమ వర్గాలు కూడా పోటీపడుతుంటాయి.




మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్న దృశ్యం



మచిలీపట్నం మెడికల్ కళాశాల

కులాల వారీగా ప్రభావం చూపే ఓటర్లు

కాపులు	- 48,000
గౌడ	- 35,000
మత్స్యకారులు	- 21,000
మాల	- 16,500
యాదవ	- 13,500
ముస్లిం	- 16,000



మొత్తం ఓటర్లు : 1,93,562

పురుషులు : 94,788

మహిళలు : 1,01,881

ఇతరులు : 11

కల సాకారమైన వేళ

జిల్లా, బందరు ప్రజల చిరకాల వాంఛ పోర్టు నిర్మాణంతో నెరవేరనుంది. గతేడాది మే 22వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో పక్క గిలకలదిండిలో మత్స్యకారులకు మెరుగైన ఉపాధి కల్పించడానికి హార్బర్ నిర్మాణం పూర్తి కావస్తోంది. మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసుకుని 150 మంది విద్యార్థులకు పూర్తి ఫ్యాకల్టీతో తరగతులు జరుగుతున్నాయి. రుద్రవరంలో కృష్ణా యూనివర్సిటీ భవనాలు నిర్మాణం పూర్తి చేసుకుని కార్యకలాపాలు జరుగుతున్నాయి. బందరు సముద్ర రవాణా, ఆక్వా రంగం, వైద్య, విద్యా రంగాలకు మచిలీపట్నం దిశా నిర్దేశంగా మారనుంది.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం..

మచిలీపట్నం నగరంలోని చిలకలపూడిలో పాండురంగ స్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. మహారాష్ట్ర దేవాలయాల తరహాలో ఈ గుడి నిర్మాణం ఉండటంతో ప్రజలు దీనిని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దసరా ఉత్సవాలకు కోల్‌కతా కాళీ మాతకు నిర్వహించే మాదిరి శక్తి పటాల ఊరేగింపును మచిలీపట్నంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. భక్తులు ఈ పటాలను కట్టుకుని మొక్కులు చెల్లించుకుంటారు. మచిలీపట్నం నియోజకవర్గంలోని మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. విశాఖ బీచ్ తరహాలో ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు రిసార్ట్స్, పార్కులు, గేమ్ జోన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో పర్యాటకంగా అభివృద్ధి చెందనుంది.

నాన్ డీబీటీ కింద జరిగిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	జరిగిన లబ్ధి (కోట్లలో)
జగనన్న గోరుముద్ద	6,63,098	3.79
హౌస్ సైట్స్	30,831	185.97
జగనన్న తోడు (రుణాలు)	8,081	8.08
బియ్యం కార్డులు	72,607	153.58
ట్యాబ్‌లు	3,204	10.25
జగనన్న విద్యా కానుక	60,836	7.70
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	11,505	23.33
వైఎస్సార్ బీమా	212	3.37
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	25,253	55.02
మొత్తం	8,75,627	451.10

డీబీటీ పథకాల లబ్ధిదారులు

పథకం	లబ్ధిదారులు	జరిగిన లబ్ధి (కోట్లలో)
వైఎస్సార్ ఆసరా	37,404	148.54
అమ్మ ఒడి	20,850	104.56
జగనన్న చేదోడు	3,437	4.78
పంటల బీమా	9,041	16.03
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	1,271	3.38
హౌసింగ్ (నేరుగా చెల్లింపు)	6,303	113.45
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	13,200	70.37
జగనన్న వసతి దీవెన	9,274	20.45
జగనన్న విద్యాదీవెన	11,757	50.94
వైఎస్సార్ కల్యాణమస్తు	52	0.50
వైఎస్సార్ కాపునేస్తం	5,917	20.49
వైఎస్సార్ లా నేస్తం	35	0.44
వైఎస్సార్ మత్స్యకార భరోసా	4,173	13.97
నేతన్న నేస్తం	409	2.80
పాస్టర్లకు సాయం	673	0.56
వైఎస్సార్ పింఛను కానుక	34,327	254.49
వైఎస్సార్ రైతుభరోసా	15,653	48.01
సున్నా వడ్డీ పంట రుణాలు	4,742	2.09
సున్నా వడ్డీ	17,504	4.75
వైఎస్సార్ వాహన మిత్ర	2315	7.07
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	20,983	54.53
వైఎస్సార్ చేయూత	12,805	62.21
మొత్తం	2,32,125	1004.49

హెక్టార్లలో సాగు విస్తీర్ణం

నియోజకవర్గంలో 5,750 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. 2,272 హెక్టార్లలో వరి, 1,646 హెక్టార్లలో మినుము, 618 హెక్టార్లలో వేరుశనగ మిగిలిన 8 హెక్టార్లలో నువ్వుల సాగు జరుగుతోంది.

పవన్‌కల్యాణ్ పర్యటనకు ముందు జనసేనకు షాక్

- మోపిదేవి మండల ప్రధాన కార్యదర్శి కేతరాజు, ఎడ్లంక గ్రామ కన్వీనర్ నరసింహారావుతో పాటు 70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: పవన్‌కల్యాణ్ అవనిగడ్డ పర్యటనకు ముందు ఆ పార్టీకి గట్టి షాక్ తగిలింది. జనసేన పార్టీ మోపిదేవి మండల ప్రధాన కార్యదర్శి కేతరాజు రామకృష్ణ, ఎడ్లంక గ్రామ కన్వీనర్ నల్లిగల నరసింహారావుతో పాటు మొత్తం 70 కుటుంబాలు జనసేన, టీడీపీల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కేతరాజు రామకృష్ణకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎడ్లంకలో జరిగిన ఆత్మీయ సమావేశంలో నరసింహారావుతో పాటు 5వ వార్డు సభ్యుడు వనమాలి విజయ్‌బాబు మరో 70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, యువ నాయకుడు సింహాద్రి వికాస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందుతున్నాయని, అందుకే రోజురోజుకీ వైఎస్సార్‌సీపీపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని చెప్పారు. ఈ ఎన్నికల్లో బందరు పార్లమెంట్ స్థానానికి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుకు, ఎమ్మెల్యేగా తనకు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కేతరాజు రామకృష్ణ మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు నచ్చి ఆ పార్టీలో పనిచేస్తే వాటికి సాక్షాత్తూ ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణే తిలోదకాలిచ్చి, కేవలం చంద్రబాబు కోసం పనిచేస్తున్నారని అన్నారు. ఆయన వైఖరి సహించలేకే ఆ పార్టీని వీడానని చెప్పారు. ఎడ్లంకకు చెందిన కొల్లు గోపాలకృష్ణ, వల్లభనేని శివకృష్ణ, దోవా మధు, దోవా నవీన్, కొల్లు సూర్యప్రకాష్, నలుకుర్తి జనార్దన్, బండెల లక్ష్మణ, మునిపల్లి కళావతి, కనుమూరి కోటమ్మ, పెమ్మాడి జనార్దన్, సిద్దయ్యతో మరికొంతమంది వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.జరూషారాణి, మాజీ సర్పంచ్‌లు సైకం బాబూరావు, నలుకుర్తి పృథ్వీరాజ్, బీసీ సెల్ మండల కన్వీనర్ సైకం నాగరాజు (నాని)తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



కేతరాజు రామకృష్ణకు వైఎస్సార్ సీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్



ఎడ్లంకలో ఎమ్మెల్యే సింహాద్రి సమక్షంలో పార్టీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎంపీ అభ్యర్థి కేశినేని నాని

గంపలగూడెంలో 20 మంది వైఎస్సార్ సీపీలో చేరిక

గంపలగూడెం: గంపలగూడెంకు చెందిన 20 మంది శుక్రవారం తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గంపలగూడెం మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు తాటికొండ వాసు, మరో 20 మంది పార్టీలో చేరారు. వారికి కేశినేని నాని కండువా కప్పి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యక్రమాల నిర్వహణలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. గంపలగూడెం పట్టణ శాఖ అధ్యక్షులు కొత్తగుండ్ల నరసింహారావు, సొసైటి మాజీ అధ్యక్షులు అల్లు కృష్ణారెడ్డి, మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ షేక్ కరీమ్, నాయకులు యనమద్ది నాగమల్లేశ్వరరావు, కొత్తగుండ్ల వంశీ, వినగడప ఉప సర్పంచ్ ఎం. నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ రద్దు చేస్తామంటున్న బీజేపీకి కొమ్ము కాస్తారా?

- సుజనా విదిల్చే చిల్లర కోసం చిల్లర వేషాలేయొద్దు
- వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు గౌస్ మొహిద్దీన్, జీఎంసీ బాషా

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకువచ్చిన 4 శాతం రిజర్వేషన్ విధానాన్ని తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని ప్రకటించిన బీజేపీకి కొమ్ము కాసే టీడీపీ మైనార్టీలు సిగ్గుపడాలని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జీఎంసీ బాషా అన్నారు. విజయవాడ విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎన్నికల ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తొలుత గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఒక్క ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన మంత్రి లేడని, ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కూడా లేడన్నారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి చంద్రబాబు బడ్జెట్‌లో కేవలం రూ.1000 కోట్లు కేటాయిస్తే, సీఎం జగన్ ప్రభుత్వం 2021–22 బడ్జెట్‌లో రూ.3,122 కోట్లు, 2022–23లో రూ.3,662కోట్లు, 2023–24లో రూ.4,203 కోట్లు కేటాయించారని వివరించారు. టీడీపీ ప్రభుత్వంలో గుంటూరులో జరిగిన నారా హమారా సభలో తమ హక్కుల కోసం ముస్లిం యువకులు ప్రశ్నిస్తే వారిపై దేశద్రోహం కేసు బనాయించిన ఘనుడు చంద్రబాబు అన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీకి ముస్లింలను ఓటు అడిగే హక్కు లేదని మండిపడ్డారు. బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరి విదిల్చే చిల్లర కోసం చిల్లర వేషాలు వేయవద్దని టీడీపీ ముస్లిం నాయకులకు హితవు పలికారు.



మాట్లాడుతున్న గౌస్ మొహిద్దీన్, జీఎంసీ బాషా

నిజాయతీపరుడైన ఆసిఫ్‌పై ఆర్థిక నేరగాడు సుజనా పోటీయా?

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జీఎంసీ బాషా మాట్లాడుతూ నిజాయతీపరుడైన షేక్ ఆసిఫ్‌పై ఆర్థిక నేరగాడైన సుజనా చౌదరిని పోటీ చేస్తున్నాడని, సుజనా నామినేషన్ రోజునే అతని దివాలాకోరుతనాన్ని ఎస్‌బీఐ బయటపెట్టిందని గుర్తు చేశారు.

బిల్డప్ బొండాను చూసి తమ్ముళ్ల బెంబేలు

- తనని కలిసి మాట్లాడాలంటే వాకీ టాకీ పట్టుకున్న సిబ్బంది అనుమతి తీసుకోవాల్సిందే
- వారు అందులో చెప్పి అటు నుంచి ఓకే అంటేనే ఉమాను కలవాలట
- మనకే ఇలా అవమానాలు ఎదురైతే.. ఇక జనాల పరిస్థితి ఇంకెంత హీనంగా ఉంటుందోనంటూ తమ్ముళ్ల గుసగుస

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అలూ లేదు.. చూలూ లేదు.. కొడుకు పేరు సోమలింగం అన్నాడంట వెనకటి కొకడు అనే సామెత మాదిరి తయారైంది సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమా తీరు. మొన్న కనీసం ఎన్నికల తేదీ కూడా ప్రకటించకముందే నేను 25 వేల ఓట్లతో గెలిచేశానురా... మీరు నా మెజార్టీ కోసమే పనిచేయండ్రా అంటూ.. అహంతో మాట్లాడిన ఆయన ఇప్పుడు ఏకంగా నేను మినిస్టర్‌ను అయిపోయానని చెప్పుకుంటూ.. ఏకంగా ఓ ఇద్దరు వ్యక్తులకు వాకీటాకీలు ఇచ్చి మరీ తన వద్ద పెట్టుకొని పట్టపగలే 'ఎన్ని కల'లు కంటున్నాడని ఆ పార్టీ కార్యకర్తలే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ బొండా బిల్డప్‌లు చూస్తున్న తెలుగు తమ్ముళ్లంతా ఏమీ లేని ఇప్పుడే ఆయన మనల్ని ఇలా అవమానపరుస్తుంటే రేపు ఎవరైనా జనాలు కలవడానికి వస్తే వారి దుస్థితి ఎలా ఉంటుందోనని గుసగుసలాడుతున్నారు.

మమ్మల్నే ఆపుతారా.. ఎవర్రా మీరంతా...

సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో ఉన్న బొండా ఉమాను కలుసుకునేందుకు టీడీపీ సీనియర్ నాయకులు వెళ్లారు. ఇంతలో వారిని ఓ వ్యక్తి లోపలకు వెళ్లకుండా ఆపేసి మీ పేర్లేంటి.. ఎందుకు కలవాలని నిలదీశారు. దీంతో కంగుతిన్న వారు మమ్మల్నే ఆపుతారా.. ఎవర్రా మీరంతా అంటూ ప్రశ్నించారు. అయినప్పటికీ ఆయన వాళ్లను ససేమిరా వెళ్లనిచ్చేది లేదని చెప్పి వాకీ టాకీలో వచ్చిన వ్యక్తుల పేర్లను బొండాకు చెప్పాడు. కాసేపటికి సరే పైకి పంపండని పిలుపు రావడంతో వారు భవనం పైనున్న బొండా ఉమాను కలుసుకోడానికి వెళ్లాల్సివచ్చింది. ఇలానే వచ్చిన మరికొంతమంది నాయకులు వాకీ టాకీ బ్యాచ్‌తో గొడవ పడి కొట్టేంత పనిచేశారు.

'బూత్'ల కోసం బూతు పురాణం

ఎన్నికల సమయంలో బూత్‌లు కేటాయించి వారికి కొంత డబ్బులు ఇస్తుంటారు. అయితే టీడీపీ నాయకులు కొందరు ఈ బూత్‌ల కోసం బూతు పురాణాలతో ఏకంగా కొట్లాటకు దిగుతున్నారు. ఇన్నేళ్లు పార్టీలో ఉన్న తమను కాదని కొత్త వారికి ఆ బూత్‌లు అప్పగించడం ఏమిటంటూ 63వ డివిజన్‌కు చెందిన నాయకులు ఘర్షణ పడ్డారు. దాదాపు అన్ని డివిజన్‌లలో ఇదే పరిస్థితి ఏర్పడడంతో కొంత మంది తమ్ముళ్లు బొండా తీరుపై గుర్రుమంటున్నారు.

నెరవేరిన చిరకాల వాంఛ



విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని మధురానగర్ వాసుల చిరకాల వాంఛ ఫలించింది. ఇక్కడ నిర్మించిన ఆర్‌యూబీతో ట్రాఫిక్ సమస్యలు తొలగడంతో పాటు సెంట్రల్ నియోజకవర్గ రూపురేఖలు మారనున్నాయి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇచ్చిన మాట ప్రకారం ఆర్‌యూబీని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కోవిడ్, సాంకేతిక కారణాలతో పనుల్లో జాప్యం జరిగినప్పటికీ నాణ్యతా ప్రమాణాలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రూ.22 కోట్ల వ్యయంతో పనులు పూర్తి చేశారు. వర్షం వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా మోటార్లు ఏర్పాటు చేయనున్నారు.

– కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ